క్లుప్తంగా

విద్యా ప్రమాణాలు పెంచాలి



లింగాలఘణపురం: ఉపాధ్యాయులు విద్యా ప్రమాణాలు పెంచే దిశగా పని చేయాలని డీఈఓ రాము కోరారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం ప్రాథమిక, ప్రాథమికోన్నత స్థాయి కాంప్లెక్స్ సమావేశం నోడల్ ఆఫీసర్ విష్ణుమూర్తి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డీఈఓ మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని అన్నారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున్, ఆర్‌పీలు నరేందర్, ప్రభాకర్, కోటి, రాఘవులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి



పాలకుర్తి: పాలకుర్తి నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి కోరారు. మంగళవారం శాసన సభలో మొదటి సారిగా ఆమె మాట్లాడారు. నియోజకవర్గంలోని కాల్వల్లో చెట్లు పెరిగి సాగునీటికి ఆటంకం ఏర్పడటంతో 30 కిలోమీటర్లు సొంత ఖర్చులతో వాటిని తొలగించి నీరు అందించడం జరిగిందన్నారు. పాఠశాలల్లో నెలకొన్న సమస్యలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. నియోజకవర్గంలో సీసీ రోడ్లు, వైద్య సదుపాయాలు, సంక్షేమ, అభివృద్ధి పనులు జరిగేలా చూడాలని యశస్విని రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు.

బీసీ డిక్లరేషన్ అమలుచేయాలి



జనగామ: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే బీసీ డిక్లరేషన్ అమలు చేస్తామని మాయమాటలు చెప్పి బీసీలకు అన్యాయం చేస్తుందని వెంటనే బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో మంగళవారం అడిషనల్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కొంతం శ్రీనివాస్, చౌదర్పల్లి సతీష్, రామకోటి, మర్క ఉపేందర్‌గౌడ్, పిట్టల సత్యం, బుర్ర తిరుపతి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం



జనగామ: పట్టణంలోని 26వ వార్డుకు చెందిన అజర్ అలీ భార్య సనా బేగం బ్లడ్ కేన్సర్‌తో హైదరాబాద్ బసవతారకం హాస్పిటల్‌లో చికిత్స పొందుతోంది. వైద్య పరీక్షల సమయంలో అత్యవసరంగా ఖరీదైన ఇంజక్షన్ ఇవ్వాలని డాక్టర్లు సూచించడంతో ఆర్థిక స్థోమత లేని అజర్ అలీ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని సాయం కోరగా ఆయన వెంటనే స్పందించారు. ఇంజక్షన్‌కు అవసరమైన డబ్బు సమకూర్చి, భవిష్యత్‌లో వైద్య పరీక్షలకు తనవంతు సహకారం ఉంటుందని కొమ్మూరి వారికి భరోసా కల్పించారు. కాగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సనాబేగం యోగ క్షేమాలను కొమ్మూరి ఫోన్ చేసి తెలుసుకున్నారు.

చేయూత



కొడకండ్ల: మండలకేంద్రానికి చెందిన నిరుపేద గాయకుడికి కొడకండ్ల లయన్స్‌క్లబ్ ప్రతినిధులు చేయూతనందించారు. కొడకండ్లలో అన్ని కులాల వారు కలిసి మెలిసి జీవిస్తున్న తీరును తన గాన రూపంలో మహేష్ పాటను రచించగా స్టూడియోలో రికార్డు చేయించే ఆర్థిక స్థోమత లేకపోవడంతో గుర్తించిన లయన్స్‌క్లబ్ ప్రతినిధులంతా కలిసి రూ.14,500 నగదును మంగళవారం అందించి పేద కళాకారుడికి ప్రోత్సాహాన్ని అందించారు.

'కేంద్రం నిధులు ఇవ్వలేదనడం విడ్డూరం'



తరిగొప్పుల: కేంద్ర ప్రభుత్వ నిధులతోనే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలుచేస్తుందని, అయినప్పటికీ కేంద్రం తెలంగాణ రాష్ట్రానికి నిధులు ఇవ్వలేదని సీఎం రేవంత్‌రెడ్డి అనడం విడ్డూరంగా ఉందని జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు ఏడెల్లి రాంనర్సింహారెడ్డి అన్నారు. మండల అధ్యక్షుడు ఆవుల శ్రీనివాస్ అధ్యక్షతన మంగళవారం ఏర్పాటు చేసిన మండల కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాంబ్రహ్మచారి, శ్రీనివాస్, రాజు, వీరకుమార్, శ్రీకాంత్, లక్పతి నాయక్, రాజశేఖర్ ఉన్నారు.

ఘనంగా సీత్లా భవాని వేడుకలు



రఘునాథపల్లి: నైవేద్యంతో వెళ్తున్న గిరిజనులు



జనగామ రూరల్: అజ్మీరాతండాలో..

రఘునాథపల్లి: మండలంలోని లక్ష్మీతండాలో సీత్లా భవాని (దాటుడు పండుగ) వేడుకలు తండావాసులు ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం సంప్రదాయాలకు అనుగుణంగా కనులపండువగా నిర్వహించుకుని ఐక్యత చాటారు. డప్పు చప్పుళ్లతో గిరిజన మహిళలు నవధాన్యాలను నెత్తిన పెట్టుకొని గ్రామ సమీపంలోని పచ్చిక బీడులో సీత్లా భవాని దేవత వద్దకు చేరుకున్నారు. అక్కడ దేవత రాతి విగ్రహాలను ప్రత్యేక అలంకరణ చేసి నైవేద్యం సమర్పించారు. వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని దేవతకు మొక్కుకున్నారు. పశువులు, మేకలను దాటించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మాలోత్ నర్సింహ, మాజీ ఉప సర్పంచ్ ముడావత్ రవి, బానోత్ బీమా, గంగమ్మ, బానోత్ శ్రీను, కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.



చిల్పూరు: ఫత్తేపూర్‌లో..

అజ్మీరాతండాలో..

జనగామ రూరల్: జనగామ మండలంలోని ఆజ్మీరాతండాలో సీత్లా భవాని పండుగను గిరిజనులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజనులు ఆరాధ్య దేవుళ్ల ఏడుగురిని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. డప్పు, చప్పుళ్లతో యువతులు, మహిళలు, చిన్నారులు నృత్యాలు చేసుకుంటూ దేవతల వద్దకు నైవేద్యం తీసుకెళ్లి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో అజ్మీరా నరేందర్, కుమార్, సురేష్, హర్య, నాగేష్, శివ దయాకర్, రవి, రాజేందర్, మారమ్మ, కమలమ్మ, సరోజ, నిర్మల, శారద, సరిత, సునిత, సుగుణ, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఫత్తేపూర్‌లో..

చిల్పూరు: మండలంలోని ఫత్తేపూర్ గ్రామంలో గిరిజనులు పవిత్రంగా నిర్వహించుకునే సీత్లా భవాని పండగలో భాగంగా దాటోడి పండగను ఘనంగా నిర్వహించుకున్నారు. వేడుకలో బానోత్ రూప్లానాయక్, గుగులోత్ మధునాయక్, ఊమ్లా నాయక్, రవి, శంకర్, వెంకటేష్, బానోతు బాలరాజు, మదన్ తదితరులు పాల్గొన్నారు.

శాకంబరీ అలంకరణలో రేణుకా ఎల్లమ్మ



పూజ చేస్తున్న భక్తులు

జనగామ: ఆషాడమాసం పురస్కరించుకుని పట్టణంలోని 3వ వార్డు బాలాజీనగర్ రేణుకా ఎల్లమ్మ తల్లి మంగళవారం శాకంబరీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కాలనీలోని మహిళలు బోనాలతో ర్యాలీగా ఆలయానికి చేరుకొని ప్రదక్షిణలు చేశారు. అమ్మవారికి జలకడవలతో పుష్పాభిషేకం చేసి నైవేద్యాలు సమర్పించారు. అనంతరం అమ్మవారికి ఒడిబియ్యం పోసి పట్టువస్త్రాలు సమర్పించారు. భక్తులు దూడల రమేష్, లగిశెట్టి కృష్ణమూర్తి, మెరుగు సురేందర్, సుజాత, సరోజన, లగిశెట్టి పద్మ, దూడల శోభా, బొడ్డు లక్ష్మి, కల్పన, సంబోజు జ్యోతి, మంజుల, దోస పాటి శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఉమేష్

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఏబీవీపీ మండల కన్వీనర్ బూర్ల ఉమేష్ డిమాండ్ చేశారు. మండలంలోని నమిలిగొండ శివారులో ఉన్న ప్రభుత్వ మోడల్ స్కూల్‌ను ఏబీవీపీ మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ మోడల్‌స్కూల్‌లో మధ్యాహ్న భోజనంలో నాణ్యత ఉండటం లేదని, అందుకే చాలా మంది విద్యార్థులు ఇంటి వద్ద నుంచే టిఫిన్‌బాక్స్‌లు తెచ్చుకుంటున్నారన్నారు. విద్యార్థులకు సరైన పౌష్టికాహారం అందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఈ విషయమై ప్రిన్సిపాల్, సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భరత్, ప్రణయ్, శివ పాల్గొన్నారు.

'ఎన్‌పీఏ దారులకు రుణమాఫీ వర్తించదు'

లింగాలఘణపురం: బ్యాంకులో తీసుకున్న పంట రుణం మూడేళ్ల వరకు రెన్యువల్ చేయకుండా ఎన్‌పీఏ (నాన్ పెర్‌ఫార్మ్ అకౌంట్)లో పడిన వారికి రుణమాఫీ వర్తించదని ఏఓ వెంకటేశ్వర్లు తెలిపారు. అదేవిధంగా డిసెంబర్ 2018 నుంచి 2023 డిసెంబర్9 వరకు బ్యాంకులో అప్పు ఉన్నట్లైతే అర్హులైన ప్రతి రైతుకు తప్పకుండా మాఫీ అవుతుందని తెలిపారు. కొంత మంది రైతుల జాబితా ఆన్‌లైన్‌లో నాట్ ఫౌండ్ డాటాగా చూపిస్తున్నాయని, అలాంటి రైతులు ఫిర్యాదు చేస్తే ఆయా బ్యాంకు అధికారులకు అందజేసి కారణాలు తెలుసుకోవడం జరుగుతుందన్నారు. అర్హులైన వారికి తప్పకుండా రుణమాఫీ వర్తించే విధంగా చర్యలు తీసుకుంటామని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. నాట్ ఫౌండ్ డాటాగా కనిపిస్తున్న సుమారు 50 మంది రైతులు ఫిర్యాదు చేశారని, వారి జాబితాను బ్యాంకులకు అందజేస్తామని చెప్పారు. మృతి చెందిన వారి పేరుతో బ్యాంక్‌లో అప్పు ఉంటే నామినీలకు వర్తిస్తుందని, ప్రధానమంత్రి కిసాన్ యోజన పథకానికి వర్తించిన నిబంధనలు రుణమాఫీకి వర్తిస్తాయని, నాలుగో తరగతి ఉద్యోగులకు మినహా ఇతరులకు వర్తించదని వివరించారు. రెండో విడతగా రూ.1.50 లక్షల రుణమాఫీ జాబితా విడుదలైందని తెలిపారు.



బచ్చన్నపేట: రుణమాఫీ లిస్టును పరిశీలిస్తున్న ఏఓ విద్యాకర్‌రెడ్డి

మాఫీ కాని రైతులు దరఖాస్తు చేసుకోవాలి

బచ్చన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పంట రుణ మాఫీ కానీ రైతులు నేరుగా దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి విద్యాకర్ రెడ్డి తెలిపారు. పీఏసీఎస్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రెండో విడుత రుణ మాఫీ 1,500 మంది రైతులకు అయిందని తెలిపారు. ఈ రైతుల ఖాతాలు ఏపీజీవీబీ, సెంట్రల్ బ్యాంక్, ఎస్‌బీఐ, డీసీసీ, తదితర బ్యాంకుల్లో ఉన్నాయని చెప్పారు. అర్హత కలిగి రుణ మాఫీ వర్తించని వారు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా పుస్తకం జిరాక్స్‌లను వ్యవసాయ శాఖ అధికారులకు లేదా బ్యాంకు అధికారులకు అందించాలని సూచించారు. సీఈఓ కాశ బాలస్వామి, ఏఈఓ రాజు, సిబ్బంది నరేందర్‌రెడ్డి, దయ్యాల నరేష్ పాల్గొన్నారు.

జీపీ కార్మికుల ముందస్తు అరెస్ట్

స్టేషన్‌ఘన్‌పూర్/బచ్చన్నపేట/జఫర్‌గఢ్: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్‌చేస్తూ మంగళవారం చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని పురస్కరించుకుని స్టేషన్‌ఘన్‌పూర్, బచ్చన్నపేట, జఫర్‌గఢ్‌లో పంచాయతీ కార్మికులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. అనంతరం సొంత పూచికత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ అరెస్టులు, నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరన్నారు. పంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు అందించాలని, పర్మనెంట్ చేయాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో సంఘం నాయకులు గుర్రం లాజర్, కుంభం రాజు, బోసు రాజు, ఠాకుర్ వివేక్‌సింగ్, కార్మికులు భిక్షపతి, సురేష్, సులోచన, మనీల, రేణుక, లక్ష్మితోపాటు తదితరులు ఉన్నారు.

గ్రామపంచాయతీ సిబ్బందిపై వివక్ష తగదు

దేవరుప్పుల: ప్రజారోగ్య పరిరక్షణ కోసం నిత్యం పాటుపడే పారిశుద్ధ్య సిబ్బందిపై పాలకవర్గాల వివక్ష తగదని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బత్తిని వెంకన్న విమర్శించారు. మంగళవారం గ్రామ పంచాయతీ కార్మికుల హక్కుల సాధన కోసం తలపెట్టిన చలో హైదరాబాద్ పిలుపు మేరకు మండల కేద్రంతోపాటు పలు గ్రామాల జీపీ సిబ్బంది తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జీపీ సంఘం మండల అధ్యక్షుడు బస్వ రామచంద్రం, ఎడవెల్లి వెంకట్‌రెడ్డి. వెంకటరమణ, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పైనుంచి జారిపడి తాపీ మేస్త్రీ మృతి

జఫర్‌గఢ్: ఇంటి నిర్మాణ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు పైనుంచి జారిపడి తాపీ మేస్త్రీ మృతి చెందిన సంఘటన వడ్డెగూడెంలో మంగళవారం చోటు చేసుకుంది. ఇదే గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు తాటికాయల యాదగిరి (46) రోజు మాదిరిగా ఇంటి నిర్మాణ పనులు చేసేందుకు తోటి కార్మికులతో కలిసి వెళ్లాడు. గోవ కట్టెలపై నిల్చోని పని చేస్తుండగా ప్రమాదవశాత్తు జారి కిందపడిపోయాడు. దీంతో తలకు బలమైన గాయాలయ్యాయి. గమనించిన తోటి కార్మికులు, స్థానికులు చికిత్స నిమిత్తం యాదగిరిని స్థానిక అస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలపడంతో మృతదేహాన్ని ఇంటికి తరలించారు.

గంజాయి పట్టివేత



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ రాజ మహేంద్రనాయక్

తరిగొప్పుల: నిషేధిత గంజాయిని సరఫరా చేస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు డీసీపీ రాజా మహేంద్రనాయక్ తెలిపారు. సీఐ సాయి రమణ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో మంగళవారం మీడియా ఎదుట నిందితుల అరెస్టును చూపారు. అనంతరం డీసీపీ మాట్లాడుతూ గంజాయిని అక్రమంగా సరఫరా చేస్తున్నారనే సమాచారంతో ఎస్సై అయ్యాల శ్వేత తన సిబ్బందితో మంగళవారం మండల పరిధిలోని ఎన్యానాయక్‌తండా క్రాస్ రోడ్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంటి మామిడి తండా వీరలగడ్డ తండాకు చెందిన భూక్య రమేశ్ కరీంనగర్ నుంచి తీసుకువచ్చి తరిగొప్పుల మండలకేంద్రానికి మహ్మద్ జలీల్‌కు విక్రయిస్తుండగా పట్టుబడినట్లు తెలిపారు. ఇద్దరిని తనిఖీ చేయగా రూ.40 వేలు విలువ చేసే 1.562 కేజీల గంజాయి పట్టుబడినట్లు చెప్పారు. గంజాయితో పాటు 2 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రమేశ్ వద్ద కొనుగోలు చేసిన గంజాయిని జలీల్ మండల పరిధిలోని చుట్టుప్రక్కల గ్రామాల్లోని యువతకు రూ.100–200లకు ప్యాకెట్లుగా విక్రయిస్తున్నట్లు విచారణలో తెలిసిందన్నారు. గంజాయి పట్టుకోవడంతో కీలకంగా వ్యవహరించి ఎస్సై అయ్యాల శ్వేత, సిబ్బందిని డీసీపీ అభినందించారు. కార్యక్రమంలో ఏసీపీ పార్థసారథి, సీఐ సాయి రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్

సీసీ కెమెరాలతో నేరాలకు అడ్డుకట్ట



వివరాలు వెల్లడిస్తున్న సీఐ గట్ల మహేందర్‌రెడ్డి

దేవరుప్పుల: వ్యాపార, వాణిజ్య సముదాయాల కేంద్రాలతోపాటు ఊరూరా కూడళ్లలో సీసీ కెమెరాలు ఉంటే నేరాలకు అడ్డుకట్ట వేయొచ్చని పాలకుర్తి సీఐ గట్ల మహేందర్‌రెడ్డి సూచించారు. మంగళవారం సాయంత్రం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో కామారెడ్డిగూడెం ఇండియన్ ఆయిల్ బంకులో జరిగిన చోరీకి పాల్పడిన వ్యక్తుల అరెస్టు చూపుతూ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ నెల 27న చిల్పూర్ మండలంలోని రాజవరానికి చెందిన ఇల్లందుల ప్రసాద్, ఆటో డ్రైవర్ ఎడ్ల మోజెస్ ఆటోలో కామారెడ్డిగూడెం పరిధి ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకుకు వచ్చారు. అర్ధరాత్రి బంకు సిబ్బంది నిద్రలో ఉండగా గమనించిన వారిద్దరు బంకు క్యాష్ కౌంటర్‌లో నుంచి రూ.30 వేలు ఎత్తుకెళ్లారు. తెల్లారి దొంగతనాన్ని గమనించిన సిబ్బంది సీసీ ఫుటేజీలతో సహా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయమై స్థానిక ఎస్సై ఊర సృజన్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా సీతారాంపురం బస్‌స్టేజీ వద్ద ఆటో అనుమానాస్పదంగా కనిపించి వెనుకకు వెళ్తుండగా దానిని పట్టుకొని అందులోని ఇద్దరు వ్యక్తులను పరిశీలించగా బంకు దొంగతనం వెల్లడైంది. వారి వద్ద నుంచి ఆటోతోసహా రూ.30 వేల నగదు స్వాధీనం చేసుకుని తదుపరి చర్యల కోసం జనగామ కోర్టుకు హాజరు పర్చనున్నట్లు వివరించారు. కాగా, వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య, పాలకుర్తి సీఐ మహేందర్‌రెడ్డిల పర్యవేక్షణలో మూడు రోజుల్లోనే దొంగలను పట్టుకునేలా కృషి చేసిన ఎస్సై ఊర సృజన్‌కుమార్, ఏఎస్సై సదానందంగౌడ్, హెడ్‌కానిస్టేబుల్ శ్యామ్, కానిస్టేబుళ్లు యాకూబ్, యాకేష్, అశోక్, సాల్మన్‌పాషాను జనగామ డీసీపీ రాజ మహేంద్రనాయక్ అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

జనగామ: పట్టణంలోని సూర్యాపేట రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు అయిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. లింగాలఘణపురం మండలం నెల్లుట్లకు చెందిన యాద నర్సింహులు బచ్చన్నపేట మండలం కేశిరెడ్డిపల్లికి వెళ్లి తన ద్విచక్రవాహనంపై తిరిగి వస్తున్న క్రమంలో రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో చేయి నుజ్జు నుజ్జు కావడంతో స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

ఇసుక అక్రమంగా తరలిస్తున్న లారీ పట్టివేత

రఘునాథపల్లి: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీని పోలీసులు పట్టున్నారు. మంగళవారం మండలంలోని కోమల్ల టోల్‌గేట్ వద్ద పెట్రోలింగ్ చేస్తున్న హెడ్ కానిస్టేబుల్ కె.నర్సయ్య, కానిస్టేబుల్ ఎ.నవీన్‌కుమార్‌లు ఏటూరునాగారం నుంచి హైదరాబాద్ వైపు వస్తున్న ఇసుక లారీని ఆపి పత్రాలు ఇవ్వమని అడిగారు. లారీ ఇసుక తరలింపునకు సంబంధించి ఎలాంటి పత్రాలు చూపించక పోవడంతో వాహనం యజమాని రామిడి మహిపాల్‌రెడ్డి, డ్రైవర్ కత్రోత్ విజయ్‌లను అదుపులోకి తీసుకున్నారు. లారీతో పాటు ఇసుకనూ స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు.

పోచన్నపేటలో ట్రాక్టర్ల..

బచ్చన్నపేట: పోచన్నపేట గ్రామంలో అనుమతులు లేకుండా ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తహసీల్దార్ విశాలాక్షి తెలిపారు. పోచన్నపేటలో అనుమతులు లేకుండా ఇసుకను తీసుకెళ్తున్న ట్రాక్టర్లను పట్టుకొని ఒక్కో ట్రాక్టర్ యజమానికి రూ. 3 వేల జరిమాన విధించినట్లు చెప్పారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సబ్సిడీ సిలిండర్ల సీజ్

జనగామ: పట్టణంలోని హోటళ్లలో వినియోగిస్తున్న 12 సబ్సిడీ సిలిండర్లను సీజ్ చేసినట్లు పౌరసరఫరాల శాఖ డీటీ ఇట్టబోయిన శ్రీనివాస్ తెలిపారు. జిల్లా అధికారి రోజారాణి ఆదేశాల మేరకు హోటళ్లపై ఆకస్మిక దాడులు చేసినట్లు చెప్పారు. పట్టుకున్న సిలిండర్లను స్థానిక శ్రీ వీరభద్ర గ్యాస్ ఏజెన్సీకి అప్పగించడం జరిగిందన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

జనగామ రూరల్: పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని భువనగిరి పార్లమెంట్ కో కన్వీనర్ కొంతం శ్రీనివాస్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో బీజేపీ మండల కార్యవర్గ సమావేశాన్ని మండల అధ్యక్షుడు లద్దునూరి మహేష్ యాదవ్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీనివాస్ పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. యువమోర్చా గిరిజన జిల్లా అధ్యక్షుడు జంగ నర్సింహారెడ్డి, బానోత్ రాంకోటి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

జనగామ/జనగామరూరల్: వ్యవసాయ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మంగలపల్లి జనార్దన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బీకేఎంయూ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏఓ రవీందర్‌కు నాయకులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. అకోజు రవీందర్, రామచంద్రం పాల్గొన్నారు.

నియామకం

నర్మెట: బీజేవైఎం మండల అధ్యక్షుడిగా మండలంలోని వెల్దండ గ్రామానికి చెందిన బొల్లం అవినాష్ నియమిస్తూ బీజేపీ మండల అధ్యక్షుడు ధరావత్ రాజునాయక్ మంగళవారం ప్రకటించారు. ఈ సందర్భంగా ఎన్నికైన అవినాష్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ పదవిని అప్పగించడానికి కృషి చేసిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

'సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం'

జనగామ రూరల్: జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఎంజీఎఫ్ జాతీయ ఇన్‌చార్జ్ తిప్పారపు లక్ష్మణ్ మాదిగ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని బతుకమ్మకుంట వైఎస్సార్ భవన్‌లో మంగళవారం నిర్వహించిన మాదిగ జర్నలిస్టుల ఫోరం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం మాదిగ జర్నలిస్టుల ఫోరం నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. సమావేశంలో సీనియర్ జర్నలిస్టు కాసాని ఉపేందర్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదల అభివృద్ధికి ప్రభుత్వాలు పాటుపడాలి

స్టేషన్‌ఘన్‌పూర్: సమాజంలో నిరుపేదల అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చొరవతో పనిచేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి బొట్ల శేఖర్ అన్నారు. ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రంలో కేవీపీఎస్ మండలస్థాయి సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. కేవీపీఎస్ మండల ప్రధాన కార్యదర్శి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి

బచ్చన్నపేట: ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని మండల నోడల్ అధికారి ఇర్రి వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆదర్శ పాఠశాలలో ఉపాధ్యాయులకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలన్నారు. శ్యాంమోహన్‌రాజు, వెంకటేశ్వర్లు, సద్గుణాచారి, శ్రీనివాస్, హెచ్‌ఎంలు వెంకట్‌రెడ్డి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రుణ మాఫీ



బచ్చన్నపేట: మండలంలోని అర్హులైన రైతులందరికీ పంట రుణ మాఫీ వర్తిస్తుందని తహసీల్దార్ విశాలాక్షి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదిక భవనం వద్ద రైతులు సంబురాలను చేసుకున్నారు. ఏఓ విద్యాకర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నూకల బాల్‌రెడ్డి, విద్యానాథ్, వెంకటాచారి పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు చేపట్టండి

జఫర్‌గఢ్: గ్రామాల్లో దోమల నివారణకు చర్యలు చేపట్టాలని బీజేపీ మండల అధ్యక్షుడు కోరుకొప్పుల నాగేశ్‌గౌడ్ కోరారు. ఈ మేరకు నాయకులు, కార్యకర్తలు మంగళవారం స్థానిక తహసీల్దార్ హరిప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి నేరెళ్ల రాజు, సోషల్ మీడియా మండల కన్వీనర్ కత్తి సందీప్‌గౌడ్, దళిత మోర్చా మండల అధ్యక్షుడు గాదెపాక శ్రీను పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతు చేపట్టాలి

లింగాలఘణపురం: జీడికల్–కళ్లెం రోడ్డుపై ఏర్పడిన గుంతలను వెంటనే పూడ్చి మరమ్మతు చేయాలని సీపీఎం మండల బాధ్యుడు దేవదానం డిమాండ్ చేశారు. మంగళవారం కళ్లెం వద్ద ప్రమాదకరంగా మారిన గుంతలను పరిశీలించి మాట్లాడుతూ గతంలో సీపీఎం ఆధ్వర్యంలో పాదయాత్ర చేపట్టి రోడ్డును మరమ్మతు చేయాలని కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశామని, దీంతో రూ.9.75 కోట్లు మంజూరు చేసి నిధులు విడుదల చేయలేదన్నారు. ఇప్పటికైనా వెంటనే నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు యాదగిరి, రాజు, బాలయ్య, బాలమ్మ, భిక్షపతి, నర్సయ్య, రాములు, శ్రీశైలం తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



కొడకండ్ల: రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు మండలంలోని మొండ్రాయి ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం అశోక్‌రెడ్డి, పీడీ సైదులు తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ ఆగస్టు 7వ తేదీన హైదరాబాద్ సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో 16 సంవత్సరాల 400 మీటర్ల విభాగంలో వి. శ్రావణి, 14 సంవత్సరాల 400 మీటర్ల విభాగంలో బి. మానస, 100 మీటర్ల విభాగంలో టి.అనిల్ పాల్గొననున్నట్లు వారు తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

అరెస్ట్ అప్రజాస్వామికం

దేవరుప్పుల: తమ న్యాయపరమమైన హక్కుల సాధన కోసం తలపెట్టిన ఆందోళనకు వెళ్లకుండా పోలీసులచే ప్రభుత్వం ముందస్తు అరెస్టులు చేయడం అప్రజాస్వామికమని సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకుడు గోలి రవీందర్ రెడ్డి విమర్శించారు. మంగళవారం సమగ్ర శిక్షా తెలంగాణ ఉద్యోగులు చేపట్టిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళ్లకుండా మండలంలోని మండల విద్యావనరుల కేంద్రం సిబ్బందిని స్థానిక పోలీసులు ముందస్తు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

లయన్స్ క్లబ్ సేవలు వినియోగించుకోవాలి

జఫర్‌గఢ్: లయన్స్ క్లబ్ అందిస్తున్న సేవలను అందరూ వినియోగించుకోవాలని క్లబ్ అధ్యక్షుడు లయన్ మహ్మద్ దస్తగిరి అన్నారు. మండలంలోని హిమ్మత్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం, లయన్ మంగు జయప్రకాశ్ సౌజన్యంతో విద్యార్థులకు ఉచితంగా వాటర్ బాటిళ్లను మంగళవారం అందజేశారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

నర్మెట: నర్మెట, తరిగొప్పుల మండలాల్లోని పలు గ్రామాలకు బస్సు సౌకర్యం లేక విద్యార్థులు, వ్యాపారస్తులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని డీసీసీ వైస్ ప్రెసిడెంట్ గంగం నర్సింహారెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం జనగామ ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతి పత్రాన్ని అందించారు.

కొనసాగుతున్న హెల్త్ సర్వే

స్టేషన్‌ఘన్‌పూర్: నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వేలో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో సర్వే బృందం ఆధ్వర్యంలో ఇంటింటా సర్వే చేస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం మండలంలోని ఇప్పగూడెం గ్రామంలో సర్వే చేపట్టారు.

అన్ని వర్గాల అభివృద్ధికి పాటుపడుతాం



ర్యాలీలో ఝాన్సీరెడ్డికి గజమాల వేస్తున్న నాయకులు

పాలకుర్తి టౌన్/పాలకుర్తి: నియోజకవర్గంలోని అన్ని వర్గాల అభివృద్ధికి పాటుపడుతామని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్‌కు చెందిన ఈజీఎస్ రాష్ట్ర డైరెక్టర్ అందె యాకయ్య, పంజా కల్పన, యువజన సంఘం నాయకుడు సురేష్, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలతోపాటు ముఖ్య నాయకులు, కార్యకర్తలు మంగళవారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి ఝాన్సీరెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాగా, నాయకులు, కార్యకర్తలు పాలకుర్తి రాజీవ్ చౌరస్తా నుంచి భారీగా ఊరేగింపు నిర్వహించి ఝాన్సీరెడ్డికి గజమాల వేశారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షుడు కుమారస్వామి, నాయకులు పాల్గొన్నారు.